
# సాక్షి నిర్మల్

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



**కామాంధుడికి జీవిత ఖైదు**

పదేళ్ల బాలికపై 2018లో అత్యాచారం చేసి హత్య చేసిన కామాంధుడు సోన్ మండల కేంద్రానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు నిర్మల్ కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. 10లో▸



**ప్రచారానికి.. గిరాకీ!**

ఎన్నికల సమయం దగ్గర పడినకొద్దీ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. పోటీలో ఉంటున్న అభ్యర్థులు ప్రత్యర్థులకు జనబలం చూపించేందుకు ఖర్చుకు వెనుకాడడంలేదు. 10లో▸




**వాతావరణం**

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న అధికారులు

**భైంసాటౌన్:** భైంసా ఏఎంసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉమా శంకర్ కాటన్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ మేరకు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వాక్ అహ్మద్, సీసీఐ, మార్కెట్ కమిటీ అధికారులు పూజలు చేసి పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. క్వింటాలుకు రూ.7,020 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించాలని సూచించారు. సీసీఐ అధికారి వెంకటేశ్వర్లు, ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పాఠశాలలను పరిశీలించిన డీఈవో

**సారంగాపూర్:** మండలంలోని జామ్, చించోలి (బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను డీఈవో రవీందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న ఉన్నతి, లక్ష్యం కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో సూచించారు. డీఈవో వెంట ఎంఈవో మధుసూదన్, ఉపాధ్యాయులు ఉన్నారు.

### నేడు కోదండరామ్ రాక

**నిర్మల్‌ఖిల్లా:** తెలంగాణ జనసమితి పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ శుక్రవారం నిర్మల్‌కు వస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల సంఘం కన్వీనర్ కొట్టె శేఖర్ తెలిపారు. 'పదేళ్ల తెలంగాణ ప్రజల కర్తవ్యం' అనే అంశంపై జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ లాడ్జిలో సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో కోదండరామ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు ఉద్యమకారులు హాజరు కావాలని సీపీఐ నాయకులు విలాస్, ఎస్ఎన్.రెడ్డి, రమేశ్, ప్రజాసంఘాల నాయకులు అజయ్, అనంతరావు కోరారు.

### 18న తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి

**నిర్మల్ రూరల్:** ఈనెల 18న ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర అధికారుల ఆదేశానుసారం ప్రతీనెల మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల చదువు గురించి వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించాలన్నారు. బడిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించి, అందులో వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. ముందుగానే తల్లిదండ్రులకు సమాచారం అందించి, ఎక్కువ మంది సమావేశానికి హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

### పెరిగిన సోయా ధర

**భైంసాటౌన్:** కొనుగోళ్లు పూర్తవుతున్న తరుణంలో సోయా ధర పెరిగింది. దీంతో ఇప్పటికే విక్రయించిన రైతులు ఆందోళన చెందుతున్నారు. భైంసా వ్యవసాయ మార్కెట్‌లో రెండురోజులుగా క్వింటాకు రూ.5 వేలకుపైగా ధర పలుకుతోంది. గురువారం క్వింటాల్‌కు రూ.5,200 వరకు వ్యాపారులు చెల్లించగా, ఇప్పటికే తక్కువ ధరకు విక్రయించిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్ల ప్రారంభం మొదలు మొన్నటి వరకు రూ.4 వేల నుంచి రూ.4,500 వేల వరకు ధర ఉండగా, ప్రస్తుతం రూ.5,200 చేరడంతో ఇదివరకే విక్రయించిన రైతులు నిరాశ చెందుతున్నారు.

### పునరావాస పనులను పరిశీలించిన పీసీసీఎఫ్




వ్యవసాయ భూమిని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్

**కడెం:** మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తుల కోసం నిర్మిస్తున్న పునరావాస కాలనీ పనులను చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ మోహన్‌చంద్ర, టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఎఫ్‌డీపీటీ శాంతారామ్ గురువారం పరిశీలించారు. అనంతరం పెత్తర్పు సమీపంలో పునరావాస గ్రామస్తులకు అందజేసిన వ్యవసాయ భూమిని పరిశీలించారు. తర్వాత రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులతో సమావేశమై వారి సందేహాలు నివృత్తి చేశారు. వారివెంట డీఎఫ్‌వో రామ్‌కిషన్, ఎఫ్‌డీవో భవానీశంకర్, ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వోలు సిద్ధార్థ, ప్రకాశ్ ఉన్నారు.

# త్రిముఖ సమరం!

- జిల్లాలో మూడుచోట్ల సీరియస్ ఫైట్..
- గెలుపు ఎవరికీ అంత ఈజీ కాదు..
- కారు.. కమలం, కాంగ్రెస్ ప్రత్యేక కసరత్తు
- జోరుగా అభ్యర్థుల ఇంటింటి ప్రచారం




**నిర్మల్:** 'హలో అన్నా.. మా నిర్మల్ జిల్లాల ఏ పార్టీ గెలుస్తదో.. చెప్పాలంటే జర కష్టమే. ఇప్పుడప్పుడే పక్కాగా చెప్పలేమన్నా. మూడు చోట్లా సీరియస్ ఫైటింగ్ నడుస్తుంది. ఇప్పటికైతే పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నరు..' బయట నుంచి ఎవరు ఫోన్ చేసి ఎట్లున్నది మీదగ్గర.. అని అడిగితే జిల్లావాసులు ఇలాగే సమాధానం చెబుతున్నారు. క్షేత్రస్థాయిలోనూ నిర్మల్, ముథోల్, ఖానాపూర్ మూడు నియోజకవర్గాల్లో త్రిముఖపోరు కొనసాగుతోంది. ఏ పార్టీకీ గెలుపు ఈజీగా లేదన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈక్రమంలోనే పార్టీల అభ్యర్థులు రోజంతా ప్రజల్లోనే ఉంటున్నారు. తమకున్న సానుకూల అంశాలను చెబుతూనే.. తమకు ఎదురవుతున్న ప్రతికూలతలపైనా దృష్టిపెడుతున్నారు.

**నిర్మల్‌లో..**

రాష్ట్రంలోనే హాట్ సీట్‌గా నిర్మల్ మారింది. ఇక్కడ మూడు ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నుంచి హేమాహేమీలైన అభ్యర్థులు బరిలో నిలువడమే ఇందుకు కారణం. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న మంత్రి, సీనియర్‌నేత అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఆశిస్తున్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు, కట్టించిన ఇళ్లు, దేవాలయాలు, తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలే తమకు ఓట్లు తీసుకువస్తాయని భావిస్తున్నారు. ఊరూరా ఉన్న పార్టీ క్యాడర్, బంధువర్గం మద్దతుతో ఉత్సాహంగా ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కలవరపెడుతోంది. బీజేపీ నుంచి బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి రెండుసార్లు ఓడిపోయిన సానుభూతితోపాటు ప్రభుత్వ వ్యతిరేకత, బీజేపీ సానుకూల పవనాలు తనకు కలిసి వస్తాయన్న ఆశతో ఉన్నారు. కానీ.. గతంలో తనతో ఉన్న మైనార్టీ ఓటర్లు ఈసారి కలిసి వస్తారా.. అన్నది అనుమానమే. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న కూచాడి శ్రీహరిరావు ఉద్యమకారుడిగా ప్రజల్లో గుర్తుండిపోయారు. వరుస ఓటములు, సీటు త్యాగాలతో తన పట్ల సానుభూతి ఉందన్న కోణంలో శ్రీహరిరావు గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీలతో పోల్చితే సంస్థాగతంగా కాంగ్రెస్‌కు పూర్తిస్థాయిలో బలం లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.

**ముథోల్‌లో..**

బీఆర్ఎస్, బీజేపీలు బలంగా కనిపిస్తున్న ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కూడా తమ సత్తా చూపుతామంటోంది. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బరిలో ఉన్నారు. తన తండ్రి గడ్డెన్న కాలం నుంచి ఏళ్లుగా అండగా నిలుస్తున్న ఓటుబ్యాంకు అలాగే ఉంది. అభివృద్ధి అంతగా లేకున్నా అవినీతి లేదన్న వాదనను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. కానీ.. పార్టీపరంగా సీనియర్ నాయకులు దూరం కావడం, కొన్ని గ్రామాల్లో వ్యతిరేకత రావడం విఠల్‌రెడ్డికి ఇబ్బందికరంగా మారింది. బీజేపీ అభ్యర్థి రామారావుపటేల్‌కు స్థానిక వాతావరణం, బీఆర్ఎస్ నుంచి సీనియర్ నాయకులు రావడం కలిసి వచ్చే అంశాలు. ఇక నిర్మల్‌లో ఉన్నట్లే ఇక్కడా మైనార్టీ ఓట్లు కీలకంగా మారడం బీజేపీకి ఇబ్బందికర విషయం. కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరావు పటేల్ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని నమ్ముకున్నారు. కానీ ముథోల్ ఓటర్లు ఎంతమేరకు కాంగ్రెస్‌ను ఆదరిస్తారనేది అనుమానంగా మారింది.

### ఖానాపూర్‌లో..

ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన ఖానాపూర్‌లో ఇద్దరు లంబాడా, ఒక ఆదివాసీ అభ్యర్థుల మధ్య పోరు నడుస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడు కావడం కలిసి వచ్చే అంశం. కానీ.. ప్రస్తుత ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకత పార్టీపై చూపుతుందేమోనన్న అనుమానం ఇబ్బందికరంగా మారింది. బీజేపీ అభ్యర్థి రమేశ్‌రాథోడ్ ఎమ్మెల్యేగా తాను చేసిన పనులే తనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఉన్నారు. ఖానాపూర్ ఓటర్లు కొత్తదనం కోరుకుంటున్నారన్న ప్రతిపక్షాల ప్రచారం అడ్డంకిగా మారింది. కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న వెడ్మ బొజ్జుకు సానుకూల అంశాలే ఎక్కువగా ఉన్నాయి. ఇద్దరు లంబాడాల మధ్య ఆదివాసీగా ఉండటం, రాజకీయాలకు కొత్తకావడం కలిసి వచ్చే అంశాలు. కానీ పార్టీపరంగా కాంగ్రెస్‌ను ఓటర్లు ఆదరిస్తారా.. అన్న అనుమానం ఉంది.

# కరెంట్ కాంగ్రెస్.. కావాల్నా?



ఇచ్చోడ సభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- తేల్చుకోవాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఆదిలాబాద్, ఇచ్చోడ ప్రజా ఆశీర్వాద సభల్లో సభికులకు ప్రశ్నలు
- ఉత్సాహంగా సమాధానాలిచ్చిన జనం
- రెండు సభలకు భారీగా జనసమీకరణ
- సభలు సక్సెస్.. గులాబీ పార్టీలో జోష్

**సాక్షి, ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ:** 'కరెంట్ కావాల్నా.. కాంగ్రెస్ కావాల్నా.., రైతుబంధు కావాల్నా.. రాబందా?..' అంటూ సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభల్లో సభికులను ప్రశ్నించారు. దీంతో కరెంట్ కావాలని... రైతుబంధు ఉండాలని జనం ఉత్సాహంగా బదులిచ్చారు. సంక్షేమ పథకాలుండాలంటే ఆదిలాబాద్, బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థులు జోగు రామన్న, అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని సీఎం కేసీఆర్ కోరారు. వీరిని గెలిపిస్తేనే బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, తద్వారా అభివృద్ధి కొనసాగుతుందని చెప్పారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే వ్యవసాయానికి 24 గంటల కరెంట్ రాదని, రైతుబంధు రద్దు చేస్తారని విమర్శించారు. గురువారం ఆదిలాబాద్, ఇచ్చోడలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలకు ఆయన హాజరై ప్రసంగించారు. ఆదిలాబాద్ చరిత్రలో ఒకే ఒక్కడు జోగు రామన్న తన మాట నిలబెట్టుకుని కోరటా–చనాకా బ్యారేజీ చేయిస్తున్నాడని, పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. అలాగే బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్‌జాదవ్ విజ్ఞప్తి మేరకు కుప్టి రిజర్వాయర్ ప్రారంభించి పూర్తి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. అనిల్‌జాదవ్‌ను గెలిపిస్తే బోథ్ రెవెన్యూ డివిజన్‌ను నెలరోజుల్లోనే ఏర్పాటు చేస్తానని చెప్పారు. డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని తెలిపారు. ఇక్కడ టమాట సాగు చేస్తున్నందున కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కోరటా–చనాకా కాలువతో 51వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. దీనిని పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు కూడా లింక్ చేసుకుంటే బ్రహ్మాండమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. జోగు రామన్న, అనిల్‌జాదవ్ సామాన్య, ఉత్తమ వ్యక్తులని, ప్రజల్లో కలిసి ఉండేవారని కితాబిచ్చారు.



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన బోథ్ అభ్యర్థి

**ఉత్సాహం నింపిన సభలు**

జిల్లాలో సీఎం కేసీఆర్ సభలు సక్సెస్ కావడంతో గులాబీ శ్రేణుల్లో ఆనందోత్సాహం కనిపిస్తోంది. ఆదిలాబాద్, ఇచ్చోడలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలకు భారీగా జనసమీకరణ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానం, బోథ్ నియోజకవర్గ పరిధిలోని ఇచ్చోడలోగల బైపాస్ రోడ్డు వద్ద మైదానంలో గురువారం భారీ బహిరంగ సభలు నిర్వహించారు. మొదట ఆదిలాబాద్‌కు మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో కేసీఆర్ హెలీక్యాప్టర్‌లో చేరుకున్నారు. సీఎం రాక ఆలస్యమైనప్పటికీ జనాలు ఉత్సాహంగా ఎదురుచూడటం కనిపించింది. తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి, మాజీ శాసనసభాపతి మధుసూదనాచారి ఆయన వెంట వచ్చారు. ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఇచ్చోడ సభకు సీఎం చేరుకున్నారు. అక్కడ ఆదిలాబాద్ సభలో పాల్గొన్న నేతలతో పాటు మాజీ ఎంపీ గోడం నగేశ్, ఇచ్చోడ, బోథ్ ఎంపీపీలు ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, తాంసి జెడ్పీటీసీ సభ్యుడు రాజు, మండల కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలి

– జోగు రామన్న, ఆదిలాబాద్ అభ్యర్థి

జిల్లాలో అధికశాతం మంది రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఇక్కడ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తే వారికి మేలు జరగనుంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలను జిల్లాకు మంజూరు చేశారు. బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు చేశారు. ఈ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలిచ్చారు. మిగతా అందరికీ త్వరలో అందజేస్తారు. జిల్లాకు ఫార్మసీ, పీజీ కళాశాలలు కూడా ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇదివరకు జిల్లాకు అనేక నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

### జనం బీఆర్ఎస్ వెంటే..

– అనిల్‌జాదవ్, బోథ్ అభ్యర్థి

బోథ్ నియోజకవర్గ జనం ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ వెంటే ఉన్నారు. బోథ్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి. డిగ్రీ కళాశాల, కుప్టి ప్రాజెక్ట్ కోసం టెండర్లు వేయాలి. ఇచ్చోడ, బోథ్ మండలాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేయాలి. చిక్‌మన్ ప్రాజెక్ట్ రీడిజైన్ చేయాలి. ఇచ్చోడలో పోలీస్ సబ్‌డివిజన్ ఏర్పాటు చేయాలి.

# 'గుర్తు'ంచుకోండి!

- అభ్యర్థులకు సింబల్స్ ఖరారు
- స్వతంత్రులకు గుర్తుల కేటాయింపు

**నిర్మల్:** ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అధికారికంగా గుర్తుల కేటాయింపు ఖరారైంది. బీఫాంలను అందించిన ప్రధాన పార్టీలకు ముందే గుర్తులు ఉండగా, ఈనెల 15న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మిగిలిన అభ్యర్థులకూ అధికారికంగా గుర్తులను కేటాయించారు. స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నవారికి నిబంధనల మేరకు సింబల్స్ ఇచ్చారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 38 మంది బరిలో ఉన్నారు. నిర్మల్‌లో 13, ముథోల్‌లో 14, ఖానాపూర్‌లో 11మంది అభ్యర్థులు ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 14 మంది స్వతంత్రులు పోటీలో ఉన్నారు.

**అభ్యర్థుల పార్టీలు–గుర్తులు..**

**నిర్మల్ నియోజకవర్గం..**

అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి(బీఆర్ఎస్–కారు), ఏలేటి మహేశ్వర్‌రెడ్డి(బీజేపీ–కమలం), కూచాడి శ్రీహరిరావు(కాంగ్రెస్–హస్తం), దేవత జగన్‌మోహన్(బీఎస్పీ–ఏనుగు), గొర్రె లింగన్న(బీఎంపీ–మంచం), పరికిపండ్ల స్వదేశ్(ఏఐఎఫ్‌బీ–సింహం), మంతెన ఇంద్రకరణ్‌రెడ్డి(ఏడీఆర్‌పీ–చపాతీరోల ర్), రవీందర్ రామగిరి(డీఎస్‌పీ–టార్చ్‌లైట్), ఖాజా నయీమొద్దీన్(స్వతంత్ర–కుండ), దేవోల్ల రాజు(స్వతంత్ర–ఫుట్‌బాల్), బుర్కరాజేందర్(స్వతంత్ర–బకెట్), మల్లేశ్‌మద్దికుంట(స్వతంత్ర–డోలి), చవాన్ సుదర్శన్(స్వతంత్ర–సిలిండర్).

**ముథోల్ నియోజకవర్గం..**

గడ్డిగారి విఠల్‌రెడ్డి(బీఆర్ఎస్–కారు), పవార్ రామారావుపటేల్(బీజేపీ–కమలం), భోస్లే నారాయణరావుపటేల్(కాంగ్రెస్–హస్తం), వినోద్‌కుమార్ శారదారావు(బీఎస్పీ–ఏనుగు), కాసారం రాజు(డీఎస్‌పీ–టార్చ్‌లైట్), గోరేకర్ విజయ్(ఐపీబీపీ–ట్రంపెట్), దేవీదాస్ హస్నే(ఆర్‌పీఐ–సిలిండర్), బద్ధం భోజారెడ్డి(ఏఐఎఫ్‌బీ–సింహం), ఎలుగుదార్ ప్రవీణ్(స్వతంత్ర–సోఫ్‌డిష్), జాదవ్ దత్తు రాం(స్వతంత్ర–కెమెరా), జాదవ్ దేవీదాస్(స్వతంత్ర–ఎయిర్ కండీషనర్), పోతరాజు సుధాకర్(స్వతంత్ర–బేబీవాకర్), మన్‌మోహన్ జాదవ్(స్వతంత్ర–చపాతీ రోలర్), సంజు హెమ్లే(స్వతంత్ర–రోడ్డు రోలర్).

**ఖానాపూర్ నియోజకవర్గం..**

భూక్య జాన్సన్‌నాయక్(బీఆర్ఎస్–కారు), రమేశ్ రాథోడ్(బీజేపీ–కమలం), వెడ్మ బొజ్జుపటేల్(కాంగ్రెస్–హస్తం), బన్సీలాల్ రాథోడ్(బీఎస్పీ–ఏనుగు), బొంత ఆశారెడ్డి(జీజీపీ–రంపం), కూతాటి విజయ(పీపీఐ–పిల్లనగ్రోవి), జాదవ్ ప్రభాస్(డీఎస్‌పీ–టార్చ్‌లైట్), పెందూర్ ప్రియాంక(సీపీఐ(ఎంఎల్)రెడ్‌స్టార్–సిలిండర్), ఆత్రం రవీందర్(స్వతంత్ర–రోడ్డు రోలర్), నేతావత్ రాజేందర్(స్వతంత్ర–కుట్టుమిషన్), మోహన్(స్వతంత్ర–బ్యాట్స్‌మన్).

## ప్రకృతి వైద్య దినోత్సవంపై ఉపన్యాస పోటీలు

**నిర్మల్ రూరల్:** గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్ధార్థ యోగ విద్యాలయం, జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై దాదాపు 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా డీఈవో రవీందర్‌రెడ్డి హాజరై ప్రకృతి మానవ జీవితంలో అత్యంత ముఖ్యమైన అంశమని, ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఉపన్యాస పోటీల విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి మ్యాక చైత్ర(జెడ్పీహెచ్ఎస్, కడ్తాల్), ద్వితీయ బహుమతి ఆకుల వైష్ణవి(కేజీబీవీ లక్ష్మణచాంద), మూడో బహుమతి మగ్గిడి సుమిత్(జెడ్పీ హెచ్ఎస్, దిలావర్‌పూర్)లు ఎంపికయ్యారు. మొదటి బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి వెయ్యి రూపాయలు, మెమెంటోలు అందించారు. ఇందులో జిల్లా పరీక్షల సహాయ అధికారి పద్మ, సోషల్ ఫోరం అధ్యక్షుడు నకిరెడ్డి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మధు సిలారి, కోశాధికారి దూస ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు గాజుల పోతన్న, ఉపాధ్యక్షురాలు హేమలత, కుర్ర శేఖర్, గరిగంటి రమేశ్, సోషల్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో డీఈవో రవీందర్‌రెడ్డి

## వైద్య శిక్షణకు టీవీవీపీ అనుమతి




విద్యార్థులను అభినందిస్తున్న సూపరింటెండెంట్

**భైంసాటౌన్:** పట్టణంలోని గురుకృప వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు భైంసాలోని ఏరియాస్పత్రిలో ఏడాదిపాటు వైద్య శిక్షణకు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ అనుమతిచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రిలో విద్యార్థులకు అభినందనలు తెలిపారు. 41 మంది విద్యార్థులకు అనుమతిస్తూ ఆదేశాలు అందినట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కమ్ రామకృష్ణ గౌడ్, ప్రిన్సిపాల్ సాయినాథ్ పాల్గొన్నారు.

## అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు

- ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్

**నిర్మల్‌ఖిల్లా:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ఏఐసీసీ సెక్రెటరీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి విష్ణునాథ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రచార సభ విజయవంతమైందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం సౌమ్యుడు ప్రతిభావంతుడైన శ్రీహరిరావుని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపిందని తెలిపారు. భారీ మెజారిటీతో గెలిపించి నిర్మల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలందరికీ రూ.500లకే సిలిండర్ అందిస్తామన్నారు. ఇందిరమ్మ రైతు భరోసా కింద భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు ఏడాదికి రూ 15 వేలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు, ఏఐసీసీ అబ్జర్వర్ ప్రకాశ్‌రాథోడ్, ప్రకాశ్‌పాటిల్, పీసీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేశ్, పీసీసీ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ సెక్రెటరీ విష్ణునాథ్

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం

- మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

**నిర్మల్‌ఖిల్లా:** రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్లు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితంతో పోలిస్తే నిర్మల్ చాలా అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోని 24 గంటలు కరెంటు సరఫరా చేస్తున్న రాష్ట్రం మనదేనన్నారు. పెన్షనర్ల సమస్యలైన ఈహెచ్ఎస్ హెల్త్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్య సదుపాయం, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, ప్రస్తుతం 5% ఇస్తున్న ఐఆర్ పెంపుదలకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి, జిల్లా కోశాధికారి, ఎల్.గంగన్న, యూనిట్ అధ్యక్షుడు విలాస్, కార్యదర్శి పి.జనార్దన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందూలాల్ శ్రీవాత్సవ, యూనిట్ కోశాధికారి కె.రమేశ్, ఆకుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**మామడ:** రైతులు పండించిన వరి ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పొన్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

**ఓటు హక్కు వినియోగించుకోవాలి....**

రానున్న ఎన్నికల్లో ప్రతీ ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలని విజయలక్ష్మి సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన పెంచుకుని ఓటింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. పొన్కల్‌లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మండలంలోని లింగాపూర్, రాయదారి గ్రామ అటవీప్రాంతంలో నాటి పొనికి వనంను సందర్శించారు. పొనికి వనం సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శివాజీ, పంచాయతీ కార్యదర్శి రాణి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

## క్లుప్తంగా

### డబ్బులు పంచిన ముగ్గురిపై కేసు

**ఆదిలాబాద్‌టౌన్:** బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలకు డబ్బులు పంచిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సైలు ఉదయ్‌కుమార్, హబీబ్ ఖాన్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో కార్యక్రమానికి హాజరైన కొంత మందికి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే జోగు రామన్నతో సంబంధం లేకుండా లిటిల్‌స్టార్ పాఠశాల సమీపంలో డబ్బులు పంచినట్లు పేర్కొన్నారు. బేల మండలం టాక్లి గ్రామానికి చెందిన మారుతి రూ.10,500, జైనథ్ మండలం కరంజి(టి)కి చెందిన బిక్కిపోతన్న నుంచి రూ.7500, ఆదిలాబాద్‌రూరల్ మండలం జాముల్‌ధరి గ్రామానికి చెందిన విఠల్ వద్ద నుంచి రూ.2వేలు స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### దాడి కేసులో ఒకరికి జరిమానా

**ఆదిలాబాద్‌టౌన్:** వ్యక్తిపై దాడిచేసిన కేసులో ఒకరికి రూ.1000 జరిమానా లేదా నెలరోజుల జైలు శిక్ష విధిస్తూ పీసీఆర్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి గురువారం తీర్పు చెప్పినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథనం మేరకు... పట్టణానికి చెందిన గాజుల హనుమాన్లు 2018 మే 26వ తేదీన బేలలోని భవాని పెట్రోల్ బంక్‌కు వెళ్లాడు. అతడి వాహనాలకు సంబంధించిన డీజిల్ లెక్క చూడాలని పెట్రోల్ బంక్ యజమాని చోప్డే రాజును అడిగాడు. అందుకు బంక్ యజమాని నిరాకరిస్తు బూతులు తిడుతూ దాడి చేశాడు. బాధితుడు బేల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సాయన్న కేసు నమోదు చేశాడు. దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశాడు. ఈ కేసులో ఆరుగురు సాక్షులను కోర్టు డ్యూటీ ఆఫీసర్ ప్రభాకర్ ద్వారా కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.నవీన్ విచారించి నేరం రుజువు చేయగా కోర్టు నేరస్తుడికి పైవిధంగా తీర్పు చెప్పింది.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**తలమడుగు:** షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడి వివరాలు ప్రకారం... కోడథ్ గ్రామానికి చెందిన గంగన్న ఇంట్లో రాత్రి కరెంటు మీటర్ వద్ద నిప్పులు చెలరేగి కూలర్‌పై పడటంతో మంటలు అంటుకున్నాయి. దీంతో పక్కనే ఉన్న ఫ్యాన్, ఫ్రీజ్, సామగ్రితో పాటు, బియ్యం పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో నుంచి పొగలు రావడంతో పక్కింట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు గమనించి స్థానికుల సాయంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సుమారుగా రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు గంగన్న తెలిపాడు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ ఆనంద్, రెవెన్యూ అధికారులు రోహిదాస్ పరిశీలించారు. నష్టపరిహారం అందేలా చూస్తామని సర్పంచ్ తెలిపాడు.



- జనం తరలింపునకు భారీగా డిమాండ్
- ఇదే అదనుగా రేట్లు పెంచుతున్న కిందిస్థాయి నేతలు
- అడిగినంత డబ్బుతోపాటు చుక్క, ముక్క ఉండాల్సిందే
- సభలు, ర్యాలీలు, ప్రచారానికి వచ్చే జనానికి ప్రత్యేక వంటకాలు
- జన సమీకరణకు నాయకుల ఆరాటం

అన్నా.. రేపు మన నియోజకవర్గంలో సభ.. ర్యాలీ ఉన్నాయి. మన ఊర్లో ప్రచారం ఉంది..పెద్ద నాయకులు వస్తున్నారు... జనం పెద్ద ఎత్తున కనబడాలే.. అంటూ ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయి చోటామోట లీడర్లను ఆదేశిస్తున్నారు. అన్నా.. వెహికిల్స్, కూలి, మందు, విందు సౌకర్యం ఏర్పాటు చేయండి.. జనాన్ని సమీకరిస్తామని చెప్తున్నారు. సభల్లో, ర్యాలీల్లో జనం ఎక్కువగా కనిపించేందుకు నేతలు అడిగినంతా ఇచ్చుకుంటున్నారు. దీంతో కూలీలకు, చోటామోటా నాయకులకు ఉపాధి లభిస్తోంది.




# ప్రచారానికి గిరాకీ!

**మంచిర్యాలఅగ్రికల్చర్:** ఎన్నికల సమయం దగ్గర పడినకొద్దీ జిల్లాలో ప్రచారం జోరందుకుంది. ఒక వైపు నామినేషన్ల పర్వం ముగిసింది. మరో 14రోజుల సమయం మాత్రమే ఉంది. పోటీలో ఉంటున్న అభ్యర్థులు ప్రత్యర్థులకు జనబలం చూపించేందుకు ఖర్చుకు వెనుకాడడంలేదు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో నిర్వహించే సభలకు జాతీయ, రాష్ట్ర అగ్రనాయకులు వస్తుండడంతో జన సమీకరణ చేపట్టడానికి నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారానికి, సభలకు వచ్చే జనాలకు నోటుతో పాటు చుక్క, ముక్క ఉంటేనే వస్తామని జనం తెగేసి చెప్తున్నారు. ఈక్రమంలో గార్డెన్లు, ఫంక్షన్‌హాళ్లు, హోటళ్లు కార్యకర్తలతో కిటకిటలాడుతున్నాయి. చికెన్ సెంటర్లు, మద్య దుకాణాల్లో గిరాకీ పెరిగింది. వందల క్వింటాళ్ల చికిన్, మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. సభ నిర్వహించే ప్రాంతాల్లోని మద్యం దుకాణాలు జనాలతో కళకళలాడుతున్నాయి. గతంలో 50 నుంచి 60 కిలోల చికిన్ అమ్మె సెంటర్లు ఎన్నికల పుణ్యమా అని 4 నుంచి 5 క్వింటాళ్ల చికెన్ విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో చికెన్ ధరలకు డిమాండ్ పెరిగింది. గతంలో కిలోకు రూ.200 నుంచి 220 వరకు ప్రస్తుతం రూ.270 నుంచి రూ.300 వరకు చేరుకుంది. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకు అమ్ముతున్నా కోరిన బ్రాండ్లు కొన్నిచోట్ల లభించడం లేదు. చాటుమాటున అమ్ముతున్న బెల్ట్ దుకాణాల్లో క్వాటర్ బాటిల్ ఎమ్మార్పీపై రూ.30 నుంచి రూ 40, బీరు రూ.50 నుంచి రూ.60 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**ఉపాధి ఇలా..**

**ఆసిఫాబాద్‌అర్బన్:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర, దేశ నాయకుల వేషధారణలు, డప్పు చప్పుళ్ల నుంచి డీజే వరకు, కోలాటం నుంచి బతుకమ్మ వరకు ప్రతి ఒక్కరికీ చేతినిండా పని దొరుకుతోంది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏగ్రామంలో పర్యటించాలని భావించినా డప్పు చప్పుళ్లు, కోలాటం, కళాకారుల నృత్యాలు, ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఏర్పాట్లు లేనిదే ప్రచారంలో జోష్ కన్పించడం లేదు. మగవారికి రూ.500, మహిళలకు రూ.300 చొప్పున చెల్లిస్తూ ప్రచారానికి వాడుకుంటున్నారు. కూలీలకు రోజువారి కూలితో పాటు భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. దీంతో నాయకులకు ప్రచారం.. కూలీలకు ఉపాధి లభిస్తోంది.

**మాంసాహార భోజనమే..**

గతంలో ఎన్నడూ లేనివిధంగా సభలకు బైక్‌పై వచ్చేవారు పెట్రోల్, భోజనం, మందు, రూ.400 నుంచి రూ.500 వరకు కూలి చెల్లిస్తేనే వస్తామని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా యువత మాంసాహార భోజనం పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. నిన్న గాపార్టీ సభకు వెళ్తే చికెన్‌తో భోజనం, మందు, రూ.300 ఇచ్చింద్రు. ఇవ్వాల సభకు రావాలంటే నాలుగు వందలు, చికెన్, మటన్, మందు ఏర్పాటు చేస్తేనే వస్తామని చెప్పుండడంతో లీడర్లు బిత్తరపోతుంద్రు.

**మద్యం దుకాణాలకు టోకెన్లు**

ఎన్నికల నియమావళిలో భాగంగా ఆయా నియోజకవర్గాల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్, పోలీసు సిబ్బంది తనిఖీలు చేపడుతున్నారు. చెక్ పోస్టులతో పాటు ఆకస్మిక తనిఖీల్లో నగదు, మద్యం, ఇతరత్రా మత్తు పదార్థాలు, బహుమతులు తరలించకుండా, ఓటర్లను ప్రభావితం చేయకుండా నియంత్రిస్తున్నారు. దీంతో సభలు, ర్యాలీలకు వచ్చే జనాలకు నగదు చెల్లించేందుకు, మద్యం సరఫరా చేసేందుకు ఇబ్బంది కలుగుతుండడంతో నాయకులు కొత్తపంథా ఎంచుకుంటున్నారు. ఆయా మద్యం దుకాణాలతో ఒప్పందాలు చేసుకుని టోకెన్లు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. నగదు సరఫరాకు కిందిస్థాయి లీడర్లు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

### నాడు నలుగురితో.. నేడు బలగంతో..

- మారిన ఎన్నికల ప్రచారం తీరు

**దండేపల్లి(మంచిర్యాల):** ఎన్నికల ప్రచారం తీరు మారింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం ప్రతీ గ్రామంలో నలుగురితో మాట్లాడి, ఎన్నికల తేదీలు చెప్పి ప్రచార కరపత్రాలు అందించి వెళ్లిన అభ్యర్థులు నేడు అన్ని గ్రామాల్లో పార్టీల నాయకులు, కార్యకర్తల బలగంతో వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గతంలో ప్రతీ గ్రామంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు కులాల వారీగా పెద్దలతో సమావేశమయ్యేవారు. బ్యాండు మేళాలు, డీజేలు లేకుండా కేవలం తమ వాహనాల్లో వచ్చి తమకు అనుకూలంగా ఉన్న పెద్దలు, వారి అనుచరులతో మాట్లాడి వెళ్లేవారు. లేదంటే గ్రామంలోని ఓ కూడలి వద్ద చిన్నపాటి సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రచారం చేసేవారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం తీరు మారింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రతీ గ్రామానికి నాలుగైదుసార్లు పార్టీల నాయకులు, కార్యకర్తలతో వెళ్లి ఇంటింటా తిరిగి ప్రచారం చేస్తున్నారు. పది ఓట్లు ఉన్న కుటుంబం వద్దకు కూడా అభ్యర్థులు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించడం గమనార్హం. వాడవాడలా, గడప గడపకూ బ్యాండు మేళాలతో వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏది ఏమైనా ప్రచారంలో నాటికి, నేటికి అనేక మార్పులు వచ్చాయనే చెప్పవచ్చు.

### వైఎస్సార్‌టీపీకి ‘సిరికొండ’ రాజీనామా

**జన్నారం(ఖానాపూర్):** వైఎస్సార్‌టీపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సిరికొండ లక్ష్మి పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయకపోవడం వల్ల పార్టీ మనుగడకు నష్టం వాటిల్లుతోందన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి ఆర్థికంగా నష్టపోయామన్నారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు పంపినట్లు తెలిపారు. త్వరలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు.

## కామాంధుడికి జీవిత ఖైదు

- చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో పదేళ్లకు తీర్పు

**నిర్మల్‌టౌన్:** బాలికపై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితుడికి నిర్మల్ కోర్టు జీవితఖైదీ, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీస్ అధికారుల వివరాల ప్రకారం.. సోన్ మండల కేంద్రానికి చెందిన తోకల ప్రవీణ్‌కుమార్ మేనకోడలు, అదే గ్రామానికి చెందిన బాలిక (10) ఇద్దరు పాఠశాల మిత్రులు. 16 జూన్ 2018వ తేదీన మధ్యాహ్నం ప్రవీణ్‌కుమార్ ఇంటికి బాలిక వచ్చింది. ఆ సమయంలో స్నేహితురాలు ఇంట్లో లేకపోవడంతో ప్రవీణ్‌కుమార్ ఎందుకు వచ్చావని బాలికను అడిగాడు. సదరు బాలిక విరోచనాలు అవుతున్నాయని, ఆస్పత్రికి వెళ్లాలని చెప్పింది. దీంతో ప్రవీణ్‌కుమార్ నేను ఆ వైపే వెళ్తున్నాని బైక్‌పై తీసుకెళ్లాడు. అప్పటికే ఆస్పత్రి బంద్ చేయడంతో తిరిగి వస్తుండగా కూచన్‌పెల్లి గ్రామ సమీపంలోని పాతబడిన భవనం వద్దకు తీసుకెళ్లి బలవంతంగా అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో ఇటుకతో తలమీద దారుణంగా కొట్టడంతో కిందపడిపోయింది. అనంతరం గొంతు నులిమి హత్య చేసి మరోసారి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తండ్రి గ్రామంలో గాలించగా ప్రవీణ్‌కుమార్ బైక్‌పై తీసుకుని వెళ్లాడని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ప్రవీణ్‌కుమార్‌పై సోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సోన్ ప్రేమ్‌దీప్ కేసు నమోదు చేశాడు. విచారణ నిమిత్తం అప్పటి సీఐ రమేష్‌బాబు, నిర్మల్ డీఎస్పీ ఉపేందర్‌రెడ్డికి అప్పగించారు. ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వై.రామరావు, వై.విశ్వష్‌రెడ్డి 21మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశారు. దీంతో జీవిత ఖైదీ, రూ.2500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.కర్ణకుమార్ గురువారం తీర్పునిచ్చారు.

**ఎస్పీ అభినందనలు..**

నేరాలకు పాల్పడితే ఏనాటికైనా శిక్షలు తప్పవని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. నిందితుడికి శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసు, కోర్టు అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

### మహిళపై కేసు నమోదు

**ఆదిలాబాద్‌రూరల్:** మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో కిరాణం షాప్‌లో మద్యం విక్రయిస్తున్న ఓ మహిళపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆమె వద్ద నుంచి లీటర్ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పచ్చకామెర్లతో విద్యార్థి మృతి



బలిరాం(ఫైల్)

**ఇంద్రవెల్లి:** పచ్చకామెర్లతో విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌లో చోటుచేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. మిలింద్ నగర్‌కు చెందిన టోప్రే రోహిదాస్, భగీరథబాయి దంపతులకు కృష్ణ, బలిరాం(13), రూపేష్ ఉన్నారు. బలిరాం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నెల రోజులుగా పచ్చకామెర్లు, జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించినా ఆరోగ్యం కుదుట పడలేదు. పరిస్థితి విషమించడంతో రెండు రోజుల క్రితం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు.

### కారు ఢీకొని ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

**ఆదిలాబాద్‌రూరల్:** మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చాందా(టి) గ్రామానికి చెందిన ఠాక్రే విలాస్, సుదర్శన్, వెంకటేష్ ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వెళ్తున్నారు. ఇదే క్రమంలో ఆదిలాబాద్ వైపు నుంచి చాందా(టి) వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ఠాక్రే విలాస్ (50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరో ఇద్దరు సుదర్శన్, వెంకటేష్‌లకు గాయాలు కావడంతో వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. విలాస్ భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

**ఆదిలాబాద్‌రూరల్:** అప్పుల బాధతో మండలంలోని అర్లి (బి) గ్రామానికి చెందిన ఆకుల ప్రవీణ్ (38) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నవీన్ నూతన ఇంటి నిర్మాణం చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేయడంతో వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై లాండసాంగ్వి శివారు ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుకన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

**కాగజ్‌నగర్‌టౌన్:** కాగజ్‌నగర్–రాళ్లపేట రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం రాత్రి రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతురాలికి దాదాపు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, ఆమె వద్ద ఉన్న సంచిలో దేవతామూర్తుల చిత్ర పటాలు ఉన్నట్లు తెలిపారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మృతదేహాన్ని సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 8712658596, 83285 12176 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

### గోదావరిలో మునిగి ఒకరు మృతి

**కోటపల్లి(చెన్నూర్):** ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దేవులవాడకు చెందిన అట్టెల బక్కయ్య (50) గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రాయిపేట సమీపంలోని గోదావరినదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుని భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### నాటుసారా, మద్యం పట్టివేత




బెల్లం పానకం పారబోస్తున్న ఎస్సై

**కౌటాల:** మండలంలోని బాలేపల్లిలో గురువారం దాడులు నిర్వహించి 15 లీటర్ల నాటుసారా, 20 మద్యం సీసాలు పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న దుర్గం నాందేవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

**6వేల లీటర్ల బెల్లం పానకం పారబోత**

**బెజ్జూర్:** మండలంలోని తలాయి, తిక్కపల్లి గ్రామాల మధ్య ప్రాణహిత నది ఒడ్డున గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 6 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు సీఓఈ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**బెల్లంపల్లి:** ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల పట్టణంలో నిర్వహించిన జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల సీవోఈ విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఐనాల భగవత్ (ఏడో తరగతి), చందా అక్షిత్ (తొమ్మిదో తరగతి) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నేటి నుంచి మహబూబ్ నగర్ జిల్లా గద్వాలలో జరుగనున్న పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరపున ఆడనున్నారు. గురువారం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, పీఈటీ వామన్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

### బైక్ కొనివ్వలేదని యువకుడు ఆత్మహత్య

**పెంచికల్‌పేట్:** తల్లిదండ్రులు బైక్ కొనివ్వలేదని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మొట్లగూడకు చెందిన పింగిరె సాయికుమార్ (21) పదోతరగతి పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. కొద్దిరోజులుగా బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. వారు నిరాకరించడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతిపై ఎస్సై కొమురయ్యను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## ‘హోంమంత్రి వ్యాఖ్యలు సరికాదు’



మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

**ఖానాపూర్:** ఖలీఫా హజ్రత్ ఉమర్‌ను సీఎం కేసీఆర్‌తో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలను యావత్ ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తుందని పలువురు ఖానాపూర్ ముస్లిం నాయకులు అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ స్వార్థ రాజకీయాల కోసం మతాన్ని మత పెద్దల పేర్లను వాడుకోవడం సిగ్గుచేటన్నారు. కేవలం సీఎం కేసీఆర్ వద్ద మెప్పు పొందడం కోసం ఇంకా వేరే ఏమైనా పనులు చేయలే తప్పితే మతాన్ని, మత విశ్వాసాలను దెబ్బతీసేలా మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మహమూద్ అలీ వ్యాఖ్యలు ముస్లిం సమాజాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేసిందన్నారు. వెంటనే రాష్ట్ర హోంమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జహీర్ హైమద్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, ఆసీఫ్‌అలీ, షౌకత్‌పాషా, ముషీర్, షారు, రియాజ్ ఖాన్, జహీర్, సమీర్, రాహీల్ ఉన్నారు.

## రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

**మంచిర్యాలఅర్బన్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో ప్రశాంత్, స్టీవెన్‌పాల్, అండర్-17 విభాగంలో కార్తీక్, బన్నీ ఎంపికయ్యారు. ఇటీవల అస్నాద్‌లో జరిగిన అండర్-14 వాలీబాల్ పోటీల్లో ఈశ్వరప్రసాద్ ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం దుర్గయ్య, పీడీ రాజయ్య, విద్యాకమిటీ సభ్యులు అభినందించారు.

**పోటీలకు తరలిన విద్యార్థులు**

గద్వాలలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెందిన విద్యార్థులు గురువారం తరలివెళ్లారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమళ, పీడీ రేణిరాజయ్య విద్యార్థులకు జెర్సీ(క్రీడా దుస్తులు)లను అందజేశారు.

## జాతీయస్థాయి పోటీలకు ‘ముత్యంపల్లి’ విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు


**కాసిపేట(బెల్లంపల్లి):** హైదరాబాద్‌లోని సీసీఆర్‌లో ఈనెల 15న నిర్వహించిన కళోత్సవ్ పోటీల్లో మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైనట్లు గైడ్ టీచర్ బండ శాంకరీ తెలిపారు. టాయ్స్ అండ్ గేమ్స్‌లో బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి జి.నరేందర్ కొబ్బరిపీచు, చెక్కపొట్టు, వెదురుతో బొమ్మలు తయారు చేయడం, బాలికల విభాగంలో బింధుప్రియ తోలుబొమ్మలు ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారు. జేడీ రాజీవ్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

## ఎన్నికల హోరు.. బెట్టింగ్‌ల జోరు..

**మంచిర్యాలక్రైం:** ఇదివరకు బెట్టింగ్ అంటే ఐపీఎల్, క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టుకోవడం మాత్రమే విన్నాం. కానీ ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపు ఓటములపై బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం. మంచిర్యాల నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై కొందరు రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు సమాచారం. మంచిర్యాలకు చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వాణిజ్య వ్యాపారులు, రూ.10 వేలకు రూ 20వేలు ఇలా మొదలుకొని రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు తెలిసింది. కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపు ఖాయమని రూ.లక్షకు... లక్ష ఇచ్చే విధంగా బెట్టింగ్ కాసినట్లు సమాచారం. కొందరు రియల్ ఎస్టేట్, వర్తక వ్యాపారులు, సామాన్యులు సైతం ఓ ప్రధాన జాతీయ పార్టీకి చెందిన అభ్యర్థి గెలుస్తాడంటూ బెట్టింగ్ కాయడం చర్చనీయాంశంగా మారింది.

## తనిఖీలు ముమ్మరం

- సమీపిస్తున్న ఎన్నికలు
- నగదు, మద్యం, బహుమతుల రవాణాపై దృష్టి



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

**మంచిర్యాలక్రైం:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పోలీసులు రోజురోజుకూ దూకుడు పెంచుతున్నారు. జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇంకా 13 రోజుల గడువు మాత్రమే ఉండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డబ్బు, మద్యం, ఇతర బహుమతుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు ముమ్మరం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, బస్టాండ్, లాడ్జీలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.